సాక్షి
నిజామాబాద్
మంగళవారం : 4 : జూలై : 2023



ప్రజావాణికి 135 ఫిర్యాదులు

నిజామాబాద్ కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 135 ఫిర్యాదులు వచ్చాయి.

- 8లో ▸



ఎనీ టైం మద్యం రెడీ

జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి వరకు బార్లను తెరిచి మద్యం విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.0 /27.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లని గాలులు వీస్తాయి. పలుచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

నేడు ఆర్టీసీ ఉత్తమ ఉద్యోగులకు బహుమతులు

ఖలీల్‌వాడి: ఆర్టీసీ నిజామాబాద్ రీజియన్ పరిధిలోని ఉత్తమ కండక్టర్లు, డ్రైవర్లు, ఆర్టీసీ ఉద్యోగులు మంగళవారం బహుమతులు అందుకోనున్నారు. హైదరాబాద్‌లోని బాగ్ లింగంపల్లిలో గల టీఎస్ ఆర్టీసీ కల్యాణ మండపంలో ఆర్టీసీ చైర్మన్ బాజిరెడ్డి గోవర్ధన్, ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా బహుమతులు అందజేయనున్నారు.

'బెస్ట్ అవైలబుల్ స్కీం'కు దరఖాస్తు చేసుకోండి

నిజామాబాద్‌అర్బన్ : బెస్ట్ అవైలబుల్ స్కీంలో భాగంగా ప్రైవేట్ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తులు చేసుకోవాలని ఎస్సీ సంక్షేమ శాఖ అధికారిణి సోమవారం శశికళ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది 1, 5 తరగతుల్లో ఇంగ్లిష్ మీడియంలో మాత్రమే ప్రవేశాలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎస్సీ కులానికి చెందిన బాల బాలికలు అర్హులన్నారు. ఈనెల 15వ తేదీలోపు ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయంలో దరఖాస్తులు పొందాలన్నారు. ఒకటో తరగతిలో దరఖాస్తు చేసుకునే బాలబాలికలు జనవరి 1, 2017 నుంచి, 31 డిసెంబర్ 2017 మధ్య జన్మించి ఉండాలన్నారు. ఈనెల 15లోపు కలెక్టరేట్‌లోని ఎస్సీ సంక్షేమశాఖ కార్యాలయంలో అందించాలన్నారు. ఈనెల 20న లాటరీ పద్ధతిలో ఎంపిక ఉంటుందన్నారు.

ముగిసిన ధ్రువపత్రాల పరిశీలన

నిజామాబాద్‌అర్బన్ : ఇంజినీరింగ్‌లో ప్రవేశాలకు సంబంధించి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం 340 మంది విద్యార్థులకు ధ్రువపత్రాల పరిశీలన జరిగింది. ఈనెల 6వ తేదీ వరకు ఈ కౌన్సెలింగ్ కొనసాగుతుందని కళాశాల ప్రిన్సిపాల్, కౌన్సెలింగ్ కన్వీనర్ శ్రీరామ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలన అనంతరం ఈనెల 8వ తేదీ నుంచి కళాశాలల ఎంపిక చేసుకున్న అవకాశం ఉంటుందన్నారు.

రైతుల ఖాతాల్లో రూ. 197కోట్లు జమ

డొంకేశ్వర్(ఆర్మూర్): వానాకాలం పంటకు రైతుబంధు సాయం రైతుల ఖాతాల్లోకి చేరుతోంది. సోమవారం నాటికి 2,43,363 రైతుల ఖాతాల్లో రూ. 197.17కోట్లకు పైగా నిధులు జమయ్యాయి. ఇంకా 42,863 మంది రైతులకు దాదాపు రూ. 81 కోట్ల వరకు పంట పెట్టుబడి సాయం రావాల్సి ఉంది.

కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి



డొంకేశ్వర్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండలం చిన్నయానం ఎస్సారెస్పీ బ్యాక్ వాటర్ ప్రాంతంలో కుక్కల దాడిలో కృష్ణ జింక మృతి చెందింది. ఆదివారమే కుక్కలు జింకను వెంబడించి దాడి చేయగా గ్రామస్తులకు గాయాలతో కనిపించింది. వెంటనే ఫారెస్టు అధికారులకు సమాచారం ఇవ్వగా డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ అధికారి సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. పశు వైద్య అధికారులను పిలిపించి గాయాలతో ఉన్న జింకకు చికిత్స అందించారు. కోలుకున్నట్లే అనిపించిన జింక సోమవారం ఉదయం మరణించింది. చనిపోయిన జింకకు పోస్టుమార్టం నిర్వహించి అక్కడే దహన సంస్కారాలు నిర్వహించారు. అయితే, గోదావరి బ్యాక్ వాటర్ ప్రాంతంలో కుక్కల దాడిలో జింకలు ప్రాణాలు కోల్పోతున్నా ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం.

ఫ్లిప్‌కార్ట్ కార్యాలయంలో చోరీ

కామారెడ్డి క్రైం: కామారెడ్డిలోని ఫ్లిప్‌కార్ట్ ఆన్‌లైన్ షాపింగ్ కార్యాలయంలో చోరీ జరిగింది. దొంగలు రూ. 5,02,999 లు అపహరించారు. వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని జయశంకర్ కాలనీలో ఫ్లిప్‌కార్ట్ కంపెనీకి చెందిన కార్యాలయం ఉంది. ఈ కార్యాలయంలో పనిచేసే వారందరూ ఆదివారం రాత్రి 8 గంటల ప్రాంతంలో పనులు ముగించుకుని తాళం వేసి ఇళ్లకు వెళ్లిపోయారు. సోమవారం ఉదయాన్నే వచ్చి చూడగా షట్టర్ తాళాలు పగులగొట్టి ఉన్నాయి. దీంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకున్నామని పట్టణ ఎస్‌హెచ్‌వో నరేష్ తెలిపారు.



నికాల్‌పూర్‌లో రంగు మారుతున్న వరి నారు

అన్నదాత.. నీటిగోస

- వర్షాలు ఆలస్యమవుతుండడంతో ఆందోళన
- ఎండిపోతున్న వరి నార్లు
- ఎస్సారెస్పీ బ్యాక్‌వాటర్ పరీవాహక ప్రాంతంలో సాగునీటి తిప్పలు
- తలాపునే గోదావరి ఉన్నా తప్పని అవస్థలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : వానాకాలం సీజన్ వచ్చి నెల రోజులవుతున్నా.. వర్షాలు కురవకపోవడంతో అన్నదాతకు సాగునీటి గోస తప్పడంలేదు. మండువేసవిలో వరుసగా రెండువారాల పాటు వర్షాలు కురవడంతో ధాన్యం తడిసిపోయి గగ్గోలు పెట్టిన రైతులకు ప్రస్తుతం వర్షాభావ పరిస్థితి ఆందోళన కలిగిస్తోంది. వర్షాలు ఆలస్యమైన కురుస్తాయనే నమ్మకంతో జిల్లాలో పలుచోట్ల రైతులు పోసిన నార్లు ఎండిపోతున్నాయి. జిల్లాలో ఇప్పటివరకు 4.17 లక్షల ఎకరాలకు గాను కేవలం 40వేల ఎకరాల్లో మాత్రమే వరి నాట్లు వేశారు. ఇదిలా ఉండగా ఎగువన ఉన్న మహారాష్ట్రలోని బాబ్లీ గేట్లు ఎత్తిన నేపథ్యంలో జిల్లాలోని శ్రీరాంసాగర్ జలాశయం నుంచి కాకతీయ కాలువ ద్వారా ఉత్తర తెలంగాణ జిల్లాలకు నీరు వదిలారు. అయితే ఎస్సారెస్పీ ఎగువన పరీవాహక ప్రాంతంలో ఉన్న సాగు భూములకు నీరందే పరిస్థితి కనిపించడం లేదు. తలాపునే గోదావరి ఉన్నా సాగునీటి తిప్పలు తప్పడం లేదు. ప్రాజెక్టు ఎగువన ఉన్న మండలాల్లో ఎత్తిపోతల పథకాలు ఉన్నప్పటికీ వాటిలో కొన్నింటినే నడిపించే పరిస్థితి నెలకొంది. కొన్నింటికి నీళ్లు అందకపోతుండడంతో నడిపే అవకాశం లేకుండా పోతోంది.

మరికొన్నింటికి అవకాశం ఉన్నప్పటికీ పైపులైన్లకు మరమ్మతులు చేస్తుండడంతో ప్రారంభించలేని పరిస్థితి ఏర్పడింది. మూడు మండలాలకు సాగునీరందించే గుత్ప ఎత్తిపోతలకు నీరందించలేని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం తల్వేద, వన్నెల్(కే), గాదేపల్లి లిఫ్టులు నడిపిస్తున్నారు. సీహెచ్ కొండూరు లిఫ్ట్ సోమవారం ఒక్కరోజు నడిచింది. నికాల్‌పూర్, మారంపల్లి ఎత్తిపోతల పైప్‌లైన్ మరమ్మతులు చేస్తున్నారు. ఇలా అనేక ప్రాంతాల్లో నీరు అందక నార్లు ఎండిపోతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో 37 లిఫ్టులు

జిల్లాలో అలీసాగర్, గుత్ప, చౌట్‌పల్లి హనుమంత్ రెడ్డి ఎత్తిపోతలతో పాటు మొత్తం 37 వరకు లిఫ్టులు ఉన్నాయి. అలీసాగర్ పరిధిలో 57వేల ఎకరాలు, గుత్ప పరిధిలో 37వేల ఎకరాలు, చౌట్‌పల్లి హనుమంత్‌రెడ్డి పరిధిలో 8వేల ఎకరాలు, వివిధ ఇతర చిన్న ఎత్తిపోతల ద్వారా సుమారు 60 వేల ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ ప్రాజెక్టులో నీళ్లు లేకపోవడంతో అత్యధిక ఎత్తిపోతల పథకాల ద్వారా నీటిని ఎత్తిపోసే పరిస్థితి లేదు.



మారంపల్లి రెండోదశ ఎత్తిపోతల పంప్‌హౌజ్

నీరందకపోతే ఇబ్బందే



నికాల్‌పూర్ ఎత్తిపోతలకు సంబంధించిన పైపులైన్ లీకేజీలున్నాయి. వాటికి మరమ్మతులు చేస్తున్నారు. మరో వారం పది రోజుల్లో వరి నాట్లు పూర్తి చేయాల్సి ఉంది. ఈలోగా వర్షాలు పడకపోయినా, ఎత్తిపోతల నీళ్లు అందకపోయినా ఇబ్బందులు తప్పవు.

– తిరుపతిరెడ్డి, రైతు, నికాల్‌పూర్

కాళేశ్వరం నీటిని నింపాలి



వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రభుత్వం కాళేశ్వరం ద్వారా ఎస్సారెస్పీ జలాశయాన్ని నింపాలి. డొంకేశ్వర్ మండలంలో ఉన్న లిఫ్టుల ద్వారా కొన్నిరోజులు మాత్రమే ఎస్సారెస్పీ నుంచి నీటిని తీసుకునే అవకాశం ఉంది. ఎస్సారెస్పీని కాళేశ్వరం నీటితో నింపడమే ఉన్న ఏకైక మార్గం.

–గంగారెడ్డి, రైతు, నూత్‌పల్లి

బట్టాపూర్ గుట్ట మింగివేతను అడ్డుకోండి

- కాలుష్య నియంత్రణ మండలి అధికారులకు హైకోర్టు ఆదేశం
- ప్రధాన న్యాయమూర్తి ఆధ్వర్యంలో కేసు విచారణ
- 11 మంది అధికారులు సహా మొత్తం 13 మందికి న్యాయస్థానం నోటీసులు
- ఆగస్టు 4కు కేసు వాయిదా
- 'గుట్టలు గుల్ల' కథనంతో స్వాహా పర్వాన్ని వెలుగులోకి తెచ్చిన 'సాక్షి'



బట్టాపూర్ గుట్ట క్వారీ(ఫైల్)

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లాలోని ఏర్గట్ల మండలం బట్టాపూర్ వద్ద నిబంధనలు అతిక్రమించి ఇష్టారాజ్యంగా గుట్టను తవ్వడాన్ని కాలుష్య నియంత్రణ మండలి తక్షణమే అడ్డుకోవాలని హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. తక్షణమే కంకర క్వారీని మూసేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్, జస్టిస్ తుకారాంజీ ధర్మాసనం ఆదేశించింది. వివరాల్లోకి వెళితే.. కేవలం 9,280 క్యూబిక్ మీటర్లకు మాత్రమే అనుమతులు ఉన్నప్పటికీ ఏకంగా ఇప్పటివరకు 15 లక్షల క్యూబిక్ మీటర్ల మేర స్వాహా చేయడం గమనార్హం. కాగా అక్రమ స్వాహా పర్వంపై గత డిసెంబర్ 9న 'సాక్షి'లో 'గుట్టలు గుల్ల' అనే కథనం ప్రచురితమైంది. ఇక పిల్‌ను హైకోర్టు స్వీకరించిన నేపథ్యంలో గత నెల 16న 'సాక్షి'లో మరోసారి కథనం ప్రచురితమైంది. 195/1 సర్వే నంబర్‌లో 3.85 హెక్టార్లలో ఉన్న ఈ గుట్ట లీజును 2016లో తీసుకున్నప్పటికీ, రక్షిత అటవీ ప్రాంతం ఆనుకుని ఉంది. అయితే కాలుష్య నియంత్రణ మండలి అనుమతులు లేకుండానే ఈ గుట్టను తవ్వడం మొదలుపెట్టారు. జియో ట్యాగింగ్ ద్వారా పరిమితికి మించి పూర్తిగా తవ్వేసి గుట్టను మింగేసినట్లు గుర్తించిన హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వ్యాజ్యాన్ని స్వీకరించారు. ఈ క్రమంలో గత నెల రెండోవారంలో హైదరాబాద్ నుంచి వచ్చిన మైన్స్ అండ్ జియాలజీ విభాగానికి చెందిన బృందం 'ఈటీఎస్' (ఎలక్ట్రానిక్ టోటల్ సర్వే) నిర్వహించారు. సదరు నివేదిక ఇప్పటికే మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్‌కు వెళ్లింది.

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఏలేటి మల్లికార్జున్‌రెడ్డి గుట్ట స్వాహాపై 'సాక్షి' కథనంతో పాటు వివిధ ఆధారాలతో ప్రముఖ న్యాయవాది రచనారెడ్డి ద్వారా హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. సోమవారం విచారణ చేసిన హైకోర్టు ఇంతగా నిబంధనలు ఉల్లంఘిస్తుంటే ఏమి చేస్తున్నారని కాలుష్య నియంత్రణ మండలి అధికారులను ప్రశ్నించింది. అనేకసార్లు నోటీసులు ఇచ్చామన్నారు. నోటీసులకు స్పందించకపోతే ఏం చర్యలు తీసుకున్నారని హైకోర్టు ప్రశ్నించడంతో అధికారులు తడబడినట్లు తెలిసింది. తక్షణమే గుట్ట తవ్వకాలను నిలిపేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, మైన్స్ అండ్ జియాలజీ ప్రిన్సిపల్ సెక్రటరీ, మైన్స్ అండ్ జియాలజీ డైరెక్టర్, కాలుష్య నియంత్రణ మండలి చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్, కాలుష్య నియంత్రణ మండలి నిజామాబాద్ రీజినల్ కార్యాలయ ఇంజినీర్, మైన్స్ అండ్ జియాలజీ నిజామాబాద్ ఏడీ, విద్యుత్ పంపిణీ రాష్ట్ర అధికారికి, నిజామాబాద్ కలెక్టర్‌కు, అదనపు కలెక్టర్‌కు, ఆర్డీవో, ఏర్గట్ల తహసీల్దార్, క్వారీ లీజుదారుడు కేవీ శ్రీకాంత్, జియోస్టోన్ ఇండస్ట్రీస్‌కు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను ఆగస్టు 4కు వాయిదా వేసింది. కాగా ఈ విచారణ క్రషర్ మూసివేతకు అడ్డంకి కాదని, తక్షణమే మూసివేత చర్యలు తీసుకోవాలని ఆదేశించడం గమనార్హం.

సాగునీటికి అధిక ప్రాధాన్యం



సమావేశంలో మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

- అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

రుద్రూర్: రాష్ట్ర ప్రభుత్వం సాగునీటికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మోస్రా మండలం గోవూర్, చింతకుంట గ్రామాల్లో సోమవారం పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం చింతకుంటలో ఏర్పాటు చేసిన సమావేశంలో స్పీకర్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి గుంటకు సాగునీరందించే లక్ష్యంతో భారీ ప్రాజెక్టులతో పాటు ఎత్తిపోతల పథకం పనులు చేపడుతోందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు కొండపోచమ్మ సాగర్ నుంచి నిజాంసాగర్‌లోకి వచ్చేలా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. బాన్సువాడ నియోజకవర్గంలో నిజాంసాగర్ ప్రాజెక్టుపై ఆయకట్టుతో నాన్ కమాండ్ ప్రాంతానికి సాగు నీరందించడానికి రూ. 150కోట్లతో నిర్మిస్తున్న చందూర్, జాకోరా, చింతకుంట లిఫ్ట్ పనులు, రూ. రెండు వందల కోట్లతో సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులు చురుగ్గా కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. వీటిద్వారా 22వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందన్నారు.

కాంగ్రెస్ నేతల మాయమాటలు నమ్మొద్దు

కాంగ్రెస్ నాయకులు మాయమాటలతో ప్రజల ముందుకు వస్తున్నారని వాటిని నమ్మవద్దని పోచారం అన్నారు. ఖమ్మం సభలో రాహుల్ గాంధీ రూ. 4వేలు పింఛన్ ఇస్తామని ప్రకటించడం ఇదే కోవలోనిదేనన్నారు. ముందు ఈ పథకాలు తొలుత కాంగ్రెస్ పాలించే రాష్ట్రాల్లో అమలు చేయాలని, తర్వాత తెలంగాణలో చెప్పాలని సవాల్ విసిరారు. బాన్సువాడ నియోజకవర్గంలో 11వేల డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విమల లింగయ్య, నరేందర్ రెడ్డి, ఎంపీపీ పిట్ల ఉమాశ్రీరాములు, జెడ్పీటీసీ విజయభాస్కర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ బాన్సువాడ సెగ్మెంట్ ఇన్‌చార్జి పోచారం సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

పోడు పట్టాలను గడువులోగా పంపిణీ చేయాలి

- ప్రభుత్వ ప్రధానకార్యదర్శి శాంతికుమారి
- వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ అంశాలపై కలెక్టర్లతో సమీక్ష




వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, అదనపు కలెక్టర్లు

సుభాష్‌నగర్: పోడు పట్టాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేస్తూ నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఏ శాంతి కుమారి సూచించారు. పోడు పట్టాల పంపిణీ, గృహలక్ష్మి, ఎరువులు–విత్తనాల నిల్వలు, ఆయిల్ పాం సాగు, నివేశన స్థలాల అందజేత, కస్టమ్ మిల్లింగ్, తెలంగాణకు హరితహారం, బీసీలకు లక్ష రూపాయల ఆర్థికసాయం, గొర్రెల పంపిణీ తదితర అంశాలపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో సీఎస్ సమీక్షించారు. పోడు పట్టాల పంపిణీలో జాప్యానికి తావులేకుండా చర్యలు చేపట్టాలని శాంతికుమారి ఆదేశించారు. వారం రోజుల్లోపు అన్ని జిల్లాల్లో పట్టాల పంపిణీ పూర్తిచేయాలని గడువు విధించారు. లబ్ధిదారులకు రైతు బంధు ద్వారా ప్రయోజనం చేకూర్చేందుకు వీలుగా వారి బ్యాంకు అకౌంట్ వివరాలను సేకరించాలన్నారు. కాగా గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తులను సేకరించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సీఎస్ కలెక్టర్లకు సూచించారు. వానాకాలం సీజన్‌లో ఎరువులు, విత్తనాల కొరత తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈవిషయమై కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు స్పందిస్తూ జిల్లాలో రైతుల అవసరాలకు సరిపడా ఎరువులు అందుబాటులో ఉన్నాయని సీఎస్ దృష్టికి తెచ్చారు. ఇప్పటికే జిల్లాలోని వివిధ సహకార సంఘాల్లో 12,256 మెట్రిక్ టన్నుల ఎరువులు, డీలర్ల వద్ద 11,262 మెట్రిక్ టన్నుల ఎరువులు సిద్ధంగా ఉంచామని వివరించారు. ఆయిల్‌పాం సాగు విషయమై సీఎస్ సమీక్షిస్తూ వానాకాలం సీజన్‌లో ఎక్కువ మంది రైతులు పంట సాగు చేసేలా కృషి చేయాలని సీఎస్ పేర్కొన్నారు. అర్హులైన వారికి నివేశన స్థలాల పంపిణీని సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే పట్టాలు అందించిన చోట వారికి కేటాయించిన స్థలాల్లో లబ్ధిదారులే ఉంటున్నారా? లేదా? అన్నది క్షేత్ర స్థాయిలో పరిశీలన జరపాలన్నారు.

రైస్‌మిల్లులకు సీఎంఆర్ కింద కేటాయించిన ధాన్యాన్ని నిర్దిష్ట గడువులోగా మిల్లింగ్ జరిపి బియ్యం నిల్వలు గోడౌన్‌లకు చేరవేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. ఎఫ్‌సీఐ గిడ్డంగులలో స్థలం సరిపడని పక్షంలో, సివిల్ సప్లయ్ గిడ్డంగులను వినియోగించుకోవాలన్నారు. 24 గంటల పాటు విద్యుత్ సరఫరా అందిస్తున్నందున నిర్ణీత గడువులోపు వారు కస్టమ్ మిల్లింగ్ రైస్ సకాలంలో అందించాల్సిందేనని సీఎస్ స్పష్టంచేశారు. హరితహారం కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ పూర్తిస్థాయి లక్ష్యానికి అనుగుణంగా మొక్కలు నాటేలా చొరవ చూపాలన్నారు. వర్షం అనుకూలించిన వెంటనే మొక్కలు నాటేందుకు అన్ని విధాలుగా సన్నద్ధమై ఉండాలన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, జిల్లా అటవీ శాఖ అధికారి వికాస్ మీనా, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏసీబీ పేరుతో వల!

- అవినీతి నిరోధక శాఖ అధికారులమంటూ ఫోన్‌లు
- రూ. లక్షలు ఇవ్వాలని బెదిరింపులు
- కామారెడ్డిలో ఆరుగురికి కాల్స్




సాక్షి, కామారెడ్డి : అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) పేరుతో ఓ ముఠా జిల్లా అధికారుల ఫోన్ నంబర్లు సేకరించి వారికి కాల్స్ చేస్తూ బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోంది. మేనేజ్ చేసుకోకపోతే ఇబ్బందుల్లో పడతారంటూ బెదిరిస్తోంది. ఇటీవల కామారెడ్డి జిల్లాలో వివిధ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు ఆరుగురికి ఏసీబీ అధికారులమంటూ ఫోన్ చేసి పరిచయం చేసుకున్నారు. "మీరు లంచాలు తీసుకుంటూ అక్రమంగా ఆస్తులు కూడబెట్టుకున్నారు. మీ కింది స్థాయి సిబ్బందే మాకు సమాచారం ఇచ్చారు. అక్రమ ఆస్తుల చిట్టా మా వద్ద ఉంది" అని చెప్పారు. కేటుగాళ్లు తాము హైదరాబాద్‌లోని జూబ్లీ హిల్స్ నుంచి కాల్ చేస్తున్నామంటూ చెప్పినట్లు తెలిసింది. ఏసీబీ కేసుల్లో చిక్కితే తిప్పలు తప్పవని హెచ్చరించిన సదరు అగంతకులు.. ఒక్కో అధికారిని రూ. 2 లక్షలనుంచి రూ. 3 లక్షల వరకు డబ్బులు డిమాండ్ చేసినట్లు సమాచారం. "కేసులతో ఇబ్బందులు పడకుండా ఉండాలంటే మా డీఎస్పీ సార్‌తో మాట్లాడుకోండి" అని ఉచిత సలహా ఇచ్చారని తెలిసింది. డీఎస్పీ ఫోన్ నంబర్ ఇవ్వాలని ఓ అధికారి అడగ్గా.. సదరు నకిలీ ఏసీబీ అధికారి ఫోన్ కట్ చేసినట్లు తెలిసింది. ఇలా ఏసీబీ అధికారుల పేరుతో ఫోన్‌లు రావడంతో తొలుత అధికారులు షాక్‌కు గురయ్యారు. అయితే ఏసీబీకి ఫిర్యాదు వెళ్తే గోప్యంగా విచారణ జరిపి, అక్రమాస్తులుంటే దాడులు చేస్తారు కానీ ఇలా ఫోన్‌లు ఎందుకు చేస్తారని అనుమానించిన అధికారులు.. తోటి అధికారులతో మాట్లాడుకునే సందర్భంలో వారితో ఏసీబీ కాల్స్ విషయం చెప్పారు. ఈ క్రమంలో ఇతరులకూ ఇలాంటి కాల్స్ వచ్చాయన్న విషయం తెలిసింది. అందరికీ ఒకే నంబర్‌నుంచి ఫోన్ కాల్స్ వచ్చాయన్న విషయాన్ని నిర్ధారించుకున్నారు. తమకు వచ్చిన ఫోన్ నంబరు గురించి, తెలిసిన వారి ద్వారా ఏసీబీ అధికారుల నంబర్లను సరి చూసుకోగా.. నంబరు ఏసీబీ సిరీస్‌ది కాదని వెల్లడైంది. ఫోన్ చేస్తున్న వ్యక్తి తెలుగులోనే మాట్లాడుతున్నాడని అధికారులు చెబుతున్నారు. ఆ నంబరుకు తిరిగి కాల్ చేస్తే స్విచ్ ఆఫ్ లేదా బిజీ వస్తోందంటున్నారు. ఫోన్ నంబర్ కర్ణాటకకు చెందినదిగా భావిస్తున్నారు.

ఎస్పీకి ఫిర్యాదు చేసిన అధికారులు

ఏసీబీ పేరుతో తమకు వచ్చిన కాల్స్ విషయమై పలువురు అధికారులు సోమవారం ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. తమకు ఏ నంబరు నుంచి కాల్స్ వస్తున్నాయన్న వివరాలను ఆయనకు అందించారు. విచారణ చేపడతామని ఎస్పీ వారికి హామీ ఇచ్చారు. సైబర్ నేరగాళ్లు ఇలాంటి పనులకు పాల్పడి ఉంటారని, అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సదరు అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. మరికొందరికి కూడా ఇలాంటి కాల్స్ వచ్చి ఉంటాయని భావిస్తున్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

సుభాష్‌నగర్: నగరంలోని దుబ్బ ప్రాంతంలో గల ప్రభుత్వ స్థలంలో నిరుపేదలు వేసుకున్న గుడిసెలకు పట్టాలు ఇవ్వాలని, ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల నిర్మాణం కోసం తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం రూ. 5లక్షలు, కేంద్ర ప్రభుత్వం రూ. 10లక్షలు కేటాయించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయకార్యదర్శి శోభన్ డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ముట్టడి నిర్వహించారు. ఈసందర్భంగా శోభన్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సొంతింటి నిర్మాణానికి గృహలక్ష్మి పథకం కింద రూ.3లక్షలు ఆర్థికసాయం చేస్తామని ప్రకటించిందని, రూ.5లక్షలకు పెంచి పేదలందరికీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 9వేల మంది పేదలు గుడిసెలు వేసుకుని నివాసం ఉంటున్నారని.. వారికి ఇంటి పట్టాలు, కరెంట్ మీటరు, వాటర్ కనెక్షన్లు, గృహలక్ష్మి ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సూర్జహాన్, పెద్ది వెంకట్రాములు, రమేశ్ బాబు, పి వెంకటేష్, సుజాత, పెద్ది సూరి, కొండ గంగాధర్, సాయిలు, శంకర్ గౌడ్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

క్లుప్తంగా

పింఛన్ కోసం వెళ్తే.. ప్రాణం పోయే..


సయ్యద్ ఖాసిం మృతదేహం

ధర్పల్లి : వృద్ధాప్య పింఛన్ డబ్బులు తీసుకోవడానికి వెళ్లి పోస్ట్ ఆఫీస్ వద్ద ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన ధర్పల్లి మండలంలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలానికి చెందిన సయ్యద్ ఖాసీం (98) అనే వృద్ధుడు సోమవారం తనకు రావాల్సిన వృద్ధాప్య పింఛన్ డబ్బులు తీసుకోవడానికి పోస్ట్ ఆఫీస్‌కి వెళ్లాడు. పోస్ట్‌ఆఫీస్‌లో సర్వర్ బిజీగా ఉండడంతో బయట నీడలో కూర్చున్నాడు. ఇంతలోనే వృద్ధుడు ఒక్కసారి స్పృహ తప్పి పడిపోయాడు. గమనించిన స్థానికులు,పోస్ట్ ఆఫీస్ సిబ్బంది ఆస్పత్రికి తరలించే లోపే వృద్ధుడు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతి చెందిన వృద్ధుడికి భార్య పిల్లలు ఉన్నారు.

దాడి చేసిన వ్యక్తి అరెస్ట్

సదాశివ నగర్(ఎల్లారెడ్డి):మండలంలోని భూంపల్లి గ్రామంలో గట్టు పంచాయతీ విషయంలో ఊరడి సాయవ్వకు సంబంధించిన బంధువులు తరచు గొడవ పడుతున్నారు. ఈ విషయంలో సోమవారం ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో ఎల్లయ్య అనే వ్యక్తిపై దాడిచేసి తీవ్రంగా గాయపర్చిన ఊరడి ర మేశ్ దాడి చేశారని పోలీసులు పేర్కొన్నారు. దీంతో ఎల్లయ్యకు సంబంధించిన వ్యక్తి ఊరడి శ్రావణ్ ఫిర్యాదు మేరకు ఊరడి రమేశ్‌పై విచారణ చేసి రిమాండ్ చేసినట్లు సీఐ రామన్ తెలిపారు.

బీరు బాటిల్‌తో..

ఖలీల్‌వాడి : నగరంలోని దుబ్బ ప్రాంతంలోని హ్యాపీ నైట్‌బార్‌లో ఆదివారం రాత్రి డాన్స్ చేస్తున్న ఇరువురి మధ్య వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. దీంతో కోటగల్లీకి చెందిన సిద్దార్థ్ రాజు, గాజులపేట్‌కు చెందిన రింకు అలియాస్ అభిషేక్ నృత్యాలు చేస్తుండగా ఒకరి కాలు ఒకరికి తగిలింది. దీంతో ఇరువురి మధ్యా మాటామాట పెరిగి ఘర్షణకు దారితీసింది. సిద్దార్థరాజుపై రింకు బీరు బాటిల్‌తో దాడి చేయడంతో సిద్దార్థరాజు వీపు వెనుక గాయాలయ్యాయి. దీంతో రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సిద్దార్థరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు రింకు అలియాస్ అభిషేక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై లింబాద్రి తెలిపారు.

టిప్పర్‌ను ఢీకొన్న బైక్ : ఒకరికి తీవ్రగాయాలు

మాక్లూర్ : రోడ్డుపై వెళ్తున్న మొరం టిప్పర్‌ను వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న నిజామాబాద్ నగరంలోని గూపన్‌పల్లికి చెందిన బాలయ్యకు తీవ్రగాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్షుల కథనం మేరకు సుమారు రాత్రి 8 గంటల సమయంలో దాస్‌నగర్ వైపు నుంచి మొరం టిప్పర్ నిజామాబాద్‌కు వెళ్తుంది. బైక్‌పై వెళ్తున్న బాలయ్య వెనక నుంచి టిప్పర్‌ను బలంగా ఢీకొట్టగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే బాలయ్యను చికిత్స నిమిత్తం 108లో జీజీహెచ్‌కు తరలించారు.

'విచారణ పేరుతో దాడి చేశారు'



రాజంపేట : రాజంపేట మండలంలో నాలుగు రోజుల క్రితం నాయిని శ్రీనివాస్, నాయిని జ్యోతి మధ్య భూతగాదా విషయంలో 10 మందిని రిమాండ్ తరలించిన విషయం విదితమే. అయితే ఈ కేసుకు సంబంధించి నాయిని జ్యోతిని పూచీకత్తుపై ముదాం సాగర్ తీసుకెళ్లారు. కాని మరుసటిరోజు పోలీస్ స్టేషన్‌లో హాజరు పర్చకపోవడంతో సోమవారం ముదాంసాగర్‌ను పోలీస్ స్టేషన్‌కు విచారించే విషయంలో స్టేషన్‌కు పిలిపించారు. అయితే పోలీసులు తన భర్తను చితకబాదారని ముదాం సాగర్ భార్య సుగుణ ఆరోపించారు. అస్వస్థతకు గురైన ముదాం సాగర్‌ను కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి పోలీసులు తరలించి వైద్యం అందిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. ఈ విషయం ఎస్సై రాజు, సీఐ తిరుపయ్యను వివరణ కోరగా ముదాంసాగర్ పూచీకత్తుపై నాయిని జ్యోతిని తీసుకెళ్లినప్పటికీ ఆమెను ఎందుకు విచారణకు తీసుకురాలేదని విచారించామన్నారు. ఈ క్రమంలో ఆయనకు మూర్ఛ రావడంతో కామారెడ్డి ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు.

ప్రజావాణికి 135 ఫిర్యాదులు

- 'ధరణి' సమస్యలే ఎక్కువ
- పోడు పట్టాల కోసం తరలివచ్చిన గిరిజనులు
- వినతులు స్వీకరించిన కలెక్టర్


కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, తదితరులు

సుభాష్‌నగర్ : ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 135 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలు కలెక్టర్‌తో పాటు అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, చిత్రామిశ్రా, డీఆర్డీఓ చందర్, జెడ్పీ సీఈఓ గోవింద్‌కు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ప్రజావాణి ఫిర్యాదులు పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

తరలివచ్చిన గిరిజనులు..

సోమవారం నిర్వహించిన ప్రజావాణికి నిజామాబాద్ రూరల్, బాన్సువాడ, బాల్కొండ నియోజకవర్గాలలో పోడు పట్టాల పంపిణీలో అన్యాయం జరిగిందని గిరిజనులు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. తండాలకు తండాలు తరలి రావడంతో కలెక్టరేట్ ఆవరణలో గిరిజనులతో నిండిపోయింది. ప్రజావాణికి పోడు భూములతోపాటు ధరణి సమస్యలపైనే అధికంగా ఫిర్యాదులు వచ్చినట్లు తెలిసింది.

ప్రభుత్వ భూమి కబ్జాపై ఫిర్యాదు..

మండలకేంద్రంలోని సర్వేనెంబర్ 461లోగల ప్రభుత్వ భూమిని కబ్జా చేశారని యువ సేన యూత్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. సర్వే నం. 461 భూమిని 462 పట్టా భూమిని కోర్టు ఆర్డర్ తెచ్చుకుని, ప్లాట్లు చేసి విక్రయించాలని చూస్తున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ప్రభుత్వ విద్యాసంస్థలను సందర్శించాలి..

జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలను కలెక్టర్ సందర్శించి సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ నగర కార్యదర్శి మహేశ్ డిమాండ్ చేశారు. ఈమేరకు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి, వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మహేష్ మాట్లాడుతూ ప్రభుత్వ స్కూళ్లను సందర్శించి సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు విశాల్, కిరణ్, సాయి తదితరులున్నారు.

నిరుద్యోగులకు అవకాశం కల్పించాలి..

డైట్ కళాశాలలో తాత్కాలిక బోధనకు రిటైర్డ్ అయిన వారికి కాకుండా, అర్హత కలిగిన నిరుద్యోగులకు మాత్రమే అవకాశం కల్పించాలని పీడీఎస్‌యూ నాయకులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నగర అధ్యక్షుడు ఎస్కే అషూర్ మాట్లాడుతూ డైట్ కళాశాలలో తాత్కాలిక ప్రాతిపదికన బోధన చేసేందుకు నోటిఫికేషన్ వెలువడిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సలీం, సందీప్, నివాస్, తదితరులు పాల్గొన్నారు.

భూమి విస్తీర్ణం నమోదు కాలేదని ఫిర్యాదు



సుభాష్‌నగర్ : సిరికొండ మండలంలోని దుప్యాతండాకు చెందిన భుక్య గంగాధర్‌కు ప్రభుత్వం పోడుపట్టాల పంపిణీలో భాగంగా పాస్‌బుక్కును అందజేసింది. పాస్‌బుక్కును అందుకున్న భుక్య గంగాధర్ బుక్‌లో విస్తీర్ణం పరిశీలించి అవాక్కయ్యాడు. పాస్‌బుక్కులో విస్తీర్ణం '0' రావడంతో ఏం చేయాలో తోచక నేరుగా కలెక్టర్ కార్యాలయానికి వచ్చాడు. అలాగే దుప్యాతండా గ్రామపంచాయతీలో 103 మంది దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు కాలేదని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కొంతమంది పేర్లు పోడు రైతుల జాబితాలో రాలేదని, పోడు భూముల రైతులకు న్యాయం చేయాలని కోరారు.

అటవీ పట్టా హక్కుపత్రం ఇప్పించాలి..


కలెక్టరేట్‌కు వచ్చిన ఇనాయత్‌నగర్ గ్రామస్తులు

బాల్కొండలోని కమ్మర్‌పల్లి మండలం ఇనాయత్‌నగర్‌కు చెందిన గ్రామస్తులు అటవీ పట్టా హక్కుపత్రం ఇప్పించాలని కోరుతూ ప్రజావాణికి తరలివచ్చారు. 30ఏళ్లుగా సాగులో ఉన్న భూమిలో తమకు తెలియకుండానే మొక్కలను పెట్టారని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. కొందరికి పట్టాలు కూడా రాలేవని, మా భూములకు పట్టాలు ఇప్పించాలన్నారు. 70 ఎకరాల భూమిలో 36 మంది రైతులు సాగు చేసుకుంటున్నారని,ఫారెస్ట్ అధికారులు అడ్డుకుంటున్నారన్నారు.

ఎనీ టైం మద్యం రెడీ..

- బార్లలో అర్ధరాత్రి వరకు అమ్మకాలు
- షట్టర్ తెరిచి మరీ దర్జాగా..
- పట్టించుకోని ఎక్సైజ్, పోలీసులు అధికారులు


శివాజీనగర్‌లో అర్ధరాత్రి తెరిచి ఉన్న బార్(ఫైల్)

ఖలీల్‌వాడి : జిల్లా కేంద్రంలో అర్ధరాత్రి వరకు బార్‌లు తెరిచి ఉంచి జోరుగా మద్యం అమ్ముతున్నప్పటికీ ఎక్సైజ్, పోలీసులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగరంలో 13 బార్‌లు ఉండగా అందులో 12 బార్‌లు నడుస్తున్నాయి. ఎక్సైజ్ నిబంధనల మేరకు బార్‌లలో మద్యాన్ని బార్‌లోపలే అమ్మాలి. కాని నగరంలో గత కొన్నేళ్లుగా లిక్కర్ దందాలో ఆరితేరిన వ్యాపారి ఒకరు తన బార్‌లో దర్జాగా రాత్రి 10 గంటల తర్వాత షట్టర్ తెరిచి బయటకు అమ్మకాలు సాగిస్తున్నారు. కొన్నేళ్లుగా ఈ తతంగం జరుగుతున్నా ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

నగరం నడిబొడ్డున..

నగరంలోని శివాజీనగర్ చౌరస్తా, గుర్బాబాది రోడ్డు, అర్సపల్లి రోడ్డులో ఉన్న బార్‌లు రాత్రి 10 గంటల నుంచి అర్ధరాత్రి వరకు బాహాటంగానే బయటకు మద్యాన్ని అమ్ముతున్నారు. ఎక్సైజ్ నిబంధనల ప్రకారం వైన్స్‌లు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు మద్యం అమ్మాలి. బార్‌లు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11:30 వరకు తెరిచి ఉంచాలి. కాని నగరంలోని ఈ మూడు ప్రాంతాల్లో ఉన్న బార్‌లు రాత్రి 10 గంటల తర్వాత వైన్స్‌లు మూసిన అనంతరం 10 గంటల నుంచి రాత్రి 11:30 వరకు బయటి వ్యక్తులకు మద్యాన్ని అమ్ముతున్నారు. అధికారికంగా బార్ తలుపులు మూసి ఉంచినప్పటికీ అనధికారికంగా రాత్రి ఒంటి గంట వరకు కూడా దర్జాగా మద్యం అమ్ముతున్నారు. ఎక్సైజ్ అధికారులకు నెలవారీగా మామూళ్లు అందుతుండడం వల్లే వాటి జోలికి వెళ్లట్లేదనే ఆరోపణలున్నాయి.

అధికారుల నిర్లక్ష్యమే..

నగరంలోని బార్‌లకు వైన్స్ మద్యం తరలుతున్నా ఎక్సైజ్ అధికారులు తనిఖీలు చేయడం లేదు. గతంలో ఓ బార్‌లో వైన్స్ మద్యం దొరకడంతో అప్పుడు ఉన్న ఓ ఎక్సైజ్ అధికారితో బేరసారాలు కుదుర్చుకున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై డిప్యూటీ కమిషనర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి విచారణ చేపట్టారు. ఈ విచారణ కూడా నామమాత్రంగానే జరిగినట్లు సమాచారం. అలాగే అర్ధరాత్రి తర్వాత బార్‌లో మద్యం బయటకు అమ్మడంపై తనిఖీలు చేయాలని ఎక్సైజ్ ఎస్సైకి ఆదేశాలు అందినప్పటికీ తనిఖీలు చేపట్టకపోవడంపై సర్వత్రా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వైన్స్‌ల ఆదాయానికి గండి..

నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో పరిధిలో 19 వైన్స్‌లు ఉన్నాయి. ఈ వైన్స్‌లో రాత్రి 10 గంటలకు మూసివేస్తున్నారు. కాని బార్లు అర్ధరాత్రి వరకు మద్యం అమ్ముతుండడంతో తమ ఆదాయానికి గండి పడుతోందని వైన్స్ యజమానులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. ఈ బార్‌లు కూడా బీర్‌కు రూ. 20, విస్కీకి రూ. 50 చొప్పున అధిక ధరలకు మద్యం అమ్ముతున్నట్లు తెలిసింది.

తనిఖీలు చేస్తాం..

రాత్రివేళ్లలో తనిఖీలు చేపట్టాలని ఎస్‌హెచ్‌వో దిలీప్‌కు ఆదేశాలిచ్చాను. ఎక్సైజ్ ఎస్సై మల్లేశ్‌కు తనిఖీలు చేపట్టాలని సూచించాం. బార్‌లకు వచ్చిన మద్యంను బయటకు అమ్మడానికి లేదు. ఇలా చేస్తే నోటీసులు అందిస్తాం. బార్‌లు అర్ధరాత్రికి అమ్మకాలు చేస్తున్నారని వైన్స్ యాజమాన్యాల నుంచి ఫిర్యాదు వచ్చింది. దీనిపై చర్యలు తీసుకుంటాం. – మల్లారెడ్డి, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నిజామాబాద్

క్రైం కార్నర్

అటవీశాఖ జీప్ ఢీకొని ఒకరి మృతి

- మృతదేహంతో బాధిత కుటుంబ సభ్యుల ఆందోళన
- న్యాయం చేయాలని డిమాండ్


ప్రకాశ్ మృతదేహం

బాన్సువాడ : బాన్సువాడ మండలం బోర్లం క్యాంప్‌లో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ప్రకాష్ (24) అనే వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రకాష్ మృతదేహంతో బాధిత కుటుంబ సభ్యులు బాన్సువాడలో ఆందోళన చేపట్టారు. వివరాలిలా ఉన్నాయి. బాన్సువాడ అటవీ శాఖకు చెందిన వాహనంలో డ్రైవర్ రవితో పాటు బీట్ ఆఫీసర్ వెంకటాపూర్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా బోర్లం క్యాంప్ బస్టాండ్ వద్ద ముగ్గురు వ్యక్తులు వెళ్తున్న బైక్‌ను ఢీకొంది. బైక్‌పై వెళ్తున్న ప్రకాష్, సందీప్, సాయికుమార్‌కు తీవ్రగాయాలు కాగా వారిని బాన్సువాడ ఆస్పత్రికి అక్కడి నుంచి నిజామాబాద్‌కు తరలించారు. వీరిలో మండలంలోని మొగులాన్‌పల్లికి చెందిన ప్రకాష్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. దీంతో అంబులెన్స్‌లో ఉన్న మృతదేహంతో ప్రకాష్ బంధువులు, స్థానికులు బాన్సువాడలోని తాడ్కోల్ చౌరస్తా వద్ద ఆందోళన చేపట్టారు. ప్రమాదం జరిగిన అటవీశాఖ వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించకుండా ఫారెస్ట్ ఆఫీస్‌లో ఉంచడంపై అనుమానాలున్నాయని, తమకు న్యాయం చేయాలని బాధిత కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. ప్రకాష్ మృతికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పట్టణ సీఐ మహేందర్‌రెడ్డి, రూరల్ సీఐ మురళీ వచ్చి పరిస్థితిని చక్కబెట్టేందుకు ప్రయత్నించిన ఫలితం కనబడలేదు. స్థానిక నాయకులు జోక్యం చేసుకుని న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో ప్రకాష్ మృతిదేహాన్ని మొగులాన్‌పల్లికి తరలించారు. బైక్ ఢీకొట్టిన తర్వాత అటవీశాఖ జీపను పీఎస్‌కు తరలించకుండా నేరుగా ఫారెస్ట్ ఆఫీస్‌కు తీసుకెళ్లడంపై అనుమానాలు వ్యక్తమయ్యాయి. జీప్‌ను అధికారికంగా బయటకు తీసుకెళ్లారా లేక వ్యక్తిగతంగా తీసుకెళ్లారా అనే విషయంలో క్లారిటీ లేకుండా పోయింది.


పోలీసులతో బాధిత కుటుంబ సభ్యుల వాగ్వాదం

పరంజా పైనుంచి పడి ఒకరు..

ఖలీల్‌వాడి : ఇంటి నిర్మాణ పనులో భాగంగా వెల్‌వేషన్ చేస్తున్న సమయంలో పరంజా నుంచి జారిపడి మేస్త్రీ మృతి చెందిన ఘటన నగరంలోని రెండో పోలీస్‌స్టేషన్ పరిధిలోని శివాజీనగర్‌లో చోటు చేసుకుంది. శివాజీనగర్‌కు చెందిన ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణానికి సంబంధించి దుబ్బ ప్రాంతానికి చెందిన మేస్త్రీ మల్లేశ్‌కు పని అప్పజెప్పాడు. మల్లేశ్ వద్ద సుభాష్‌నగర్‌లోని రైతుబజార్ ప్రాంతానికి చెందిన నాగరాజు(40) పనిచేస్తున్నాడు.

సోమవారం భవంతి నిర్మాణంలో భాగంగా పరంజా ఎక్కి పనిచేస్తుండగా అక్కడి నుంచి జారి పడి నాగరాజు అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పూర్ణేశ్వర్ తెలిపారు. శవాన్ని పోస్టుమార్టరం నిమిత్తం జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించామని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆవు..



ఇందల్వాయి : ఇందల్వాయి మండల కేంద్రంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవర్‌పై సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆవు మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ నుండి కామారెడ్డి వైపు వెళ్తున్న కారు ఫ్లైఓవర్ మీదుకు చేరుకోగానే ఎదురుగా ఉన్న ఆవును ఢీకొట్టడంతో ప్రమాదం జరిగిందని ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరికి స్వల్ప గాయాలు కాగా తీవ్రంగా గాయపడ్డ ఆవు కొద్దిసేపటికే మృతి చెందినట్లు తెలిపారు. పశువైద్యులకు సమాచారం అందించినా ఎవరు స్పందించలేదని ప్రత్యక్ష సాక్షులు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలు

బాల్కొండ : బాల్కొండ మండల కేంద్ర శివారులో జాతీయ రహదారి 44పై ఎదురెదురుగా వస్తున్న టీవీఎస్ ఎక్స్‌ఎల్ వాహనం, బైక్ ఢీకొనడంతో మండలంలోని కిసానగర్‌కు చెందిన దేవిదాస్‌కు, మండల కేంద్రానికి చెందిన వడ్ల రాములకు గాయాలయ్యాయి. దేవిదాస్‌కు తలకు తీవ్ర గాయలై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. రాములకు కాలు విరిగింది. ఇద్దరిని జిల్లాకేంద్రంలోని ప్రభుత్వాస్పత్రికి 108లో తరలించినట్లు ఎస్సైపేర్కొన్నారు.

వివాహిత అదృశ్యం

ఖలీల్‌వాడి : ఇందల్వాయి మండలం వేణుగోపాల్ తండా చెందిన లేవుడియా సరిత అనే వివాహిత అదృశ్యమైనట్లు ఎస్సై శ్రావణ్‌కుమార్ పేర్కొన్నారు. ఈనెల 1న గ్రూపు–4 పరీక్ష రాయడానికి కాంతేశ్వర్ ఉమెన్స్ కాలేజీకి వచ్చారన్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత అదృశ్యమైందని సరిత భర్త శ్రీకాంత్ తమకు ఫిర్యాదు చేశారన్నారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మోపాల్ మండలంలోని నర్సింగ్‌పల్లిలో..

మోపాల్(నిజామాబాద్‌రూరల్) : మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామానికి చెందిన కల్వరాల రాణి ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు అదృశ్యం కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో మహేశ్ సోమవారం తెలిపారు. ఆయన కథనం ప్రకారం రాణి, పత్రి సాయినాథ్‌ను రెండేళ్ల క్రితం ప్రేమించి పెళ్లి చేసుకుంది. అప్పటి నుంచి నర్సింగ్‌పల్లిలోనే కూలీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈనెల 18న పనికి వెళ్లిన సాయినాథ్ సాయంత్రం ఇంటికి వచ్చేసరికి రాణి కన్పించలేదు. రాణి ఆచూకీ లభించకపోవడంతో సోమవారం పోలీసులకు ఫిర్యాదుచేశారు.

బోధన్ మండలంలోని పెగడాపల్లిలో..

బోధన్ : మండలంలోని పెగడాపల్లికి చెందిన వివాహిత పోతరాజు సవిత (22) అదృశ్యమైనట్లు ఆమె భర్త అశోక్ ఫిర్యాదు చేసినట్లు రూరల్ ఎస్సై సందీప్ సోమవారం తెలిపారు. రూరల్ ఎస్సై తెలిపిన ప్రకారం బోధన్ మండలంలోని పెగడాపల్లి గ్రామానికి చెందిన పోతరాజు అశోక్‌తో కోటగిరి గ్రామానికి చెందిన సవితకు ఏడాదిన్నర క్రితం పెళ్లి జరిగింది. జూన్ 30న ఉదయం వేళ అశోక్, ఆయన తల్లిదండ్రులు లింగవ్వ, సాయిలు కూలీ పనికి వెళ్లారు. తిరిగి రాత్రి 7 గంటల సమయంలో ఇంటికి తిరిగి రాగా, ఇంట్లో ఉన్న సవిత కనిపించలేదు. సవిత భర్త ఫిర్యాదు మేరకు విచారిస్తున్నామని తెలిపారు.

బ్యాగులో నుంచి డబ్బులు చోరీ


సీసీ పుటేజీలో కనిపించిన మహిళలు

ఖలీల్‌వాడి : నగరంలోని ఓ ఆస్పత్రిలో బురఖాలు ధరించిన ఇద్దరు మహిళలు ఆస్పత్రికి వచ్చిన ఓ మహిళ బ్యాగ్‌లో నుంచి డబ్బులు చోరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు సోమవారం తెలిపారు. ఈ నెల 2న ఆర్మూర్‌కు చెందిన దాసరి కృష్ణ తన బావ దోమల సుదర్శన్‌తో గొడవపడగా దాసరి కృష్ణకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్రం మనోరమ ఆస్పత్రిలో తీసుకొచ్చారు. అనంతరం బిల్లు కట్టేందుకు ఆయన భార్య వినోద రూ.96,500ను బ్యాగ్‌లో పెట్టుకుని ఆస్పత్రి లిఫ్ట్‌లో వెళ్తుండగా బురఖా ధరించిన ఇద్దరు మహిళలు ఆమె బ్యాగ్ నుంచి డబ్బులు చోరీ చేసినట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

మహిళపై అడవి పంది దాడి



లింగంపేట(ఎల్లారెడ్డి) : మండలంలోని పర్మళ్ల మాలోత్ తండాకు చెందిన మాలోత్ మీనా తన పంట చేనులో పనులు చేస్తుండగా అడవి పంది దాడి చేయడంతో తీవ్ర గాయాలైనట్లు గ్రామస్తులు తెలిపారు. రోజు వారిగా అటవీ ప్రాంతంలో ఉన్న పంట చేనుకు వెళ్లి పనులు చేస్తున్న సమయంలో అడవిపంది వేగంగా వచ్చి దాడి చేసినట్లు తెలిపారు. చుట్టు పక్కల కూలీలు గట్టిగా అరుస్తూ వెంబడించడంతో అడవిపంది అడవిలోకి పారిపోయినట్లు తెలిపారు. గాయాలైన మీనను లింగంపేటలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఉరి వేసుకుని వృద్ధురాలి ఆత్మహత్య

మాక్లూర్ : మండలంలోని మాదాపూర్ గ్రామానికి చెందిన కాసుల పోశాని(77) తరుచూ అనారోగ్యానికి గురికావటాన్ని తట్టుకోలేక ఇంట్లో ఎవరు లేని సమయంలో దూలానికి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు మాక్లూర్ ఎస్సై యాదగిరిగౌడ్ సోమవారం తెలిపారు. కుమారుడు కాసుల భూమన్న ఫిర్యాదు మేరకు పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం శవాన్ని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

ఒకరి ఆత్మహత్యాయత్నం

రుద్రూర్ : మోస్రా మండలం చింతకుంట గ్రామంలో జి గంగాధర్ (45) అనే వ్యక్తి సోమవారం కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. సమీపంలోనే స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డికి సంబంధించి కార్యక్రమం జరుగుతుండగా అక్కడే ఉన్న వైద్య సిబ్బంది వెంటనే సంఘటనాస్థలానికి వెళ్లి గంగాధర్‌కు ప్రాథమిక చికిత్స చేశారు. మెరుగైన చికిత్స కోసం ఆయనను బోధన్ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

అయితే ప్రమాదమేమి లేదని అక్కడి వైద్యులు పేర్కొన్నారు. ఇంటి సమీపంలో ఉన్న స్థలం ఇతరులకు కేటాయిస్తున్నారనే మనస్తాపంతో గంగాధర్ ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లగా ఆత్మహత్యాయత్నానికి కారణాలు తెలియరాలేదన్నారు.

ఆత్మలూ ఉపాధి పనులు చేశాయట!

- మృతిచెందిన వారి పేర్లతో బిల్లులు
- మొక్కల పెంపకంలో జీపీ కార్యదర్శుల అలసత్వం
- ప్రజావేదికలో వెల్లడైన వాస్తవాలు


వివరాలు తెలుసుకుంటున్న డీఆర్‌డీవో సాయన్న

నస్రుల్లాబాద్(బాన్సువాడ) : నస్రుల్లాబాద్‌లో మండల కేంద్రంలో సోమవారం ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్వహించిన ప్రజావేదికలో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. చనిపోయిన వారి పేరుతో పనులు చేసినట్లుగా సిబ్బంది రాసుకున్నట్లు తనిఖీల్లో వెల్లడి కావడంతో అధికారులు అవాక్కయ్యారు. డీఆర్‌డీవో సాయన్న ఆధ్వర్యంలో డిసెంబర్ 2020 నుంచి మార్చి 2023 వరకు ఉపాధి పనులకు సంబంధించి తనిఖీ బృందం సోమవారం తనిఖీలు చేసింది. ఏళ్లు గడిచినా చేసిన ఉపాధి హామీ పనులకు డబ్బులివ్వకుండా వేధిస్తున్నారనే విషయం ఈ తనిఖీలో బయటికొచ్చింది. నివేదికల్లో వేల మొక్కలు నాటినట్లు రాసుకున్నా ఫీల్డ్‌పై మొక్కలు లేకపోవడంపై జీపీ కార్యదర్శులను ప్రశ్నించగా మొక్కలు పెరగడం లేదంటూ పేర్కొనడంపై అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందులో భాగంగా మైలారం గ్రామంలో గొల్ల మహేందర్ అనే వ్యక్తి చనిపోయిన తర్వాత కూడా ఉపాధి పనులకు వచ్చినట్లు సిబ్బంది రాసుకున్నారు. గడ్డం జయలక్ష్మి అనే మహిళ ఐదేళ్లుగా పనిచేయకున్నా ఆమె 20 రోజులు పనిచేసినట్లు బిల్లులు తీసుకున్నట్లు తనిఖీలు తేలింది. చంద్రకళ అనే మహిళ రెండేళ్లుగా పనిచేయకున్నా వారంరోజుల నుంచి బిల్లు తీసుకున్నట్లు లెక్కల్లో సిబ్బంది రాసుకున్నారు. గ్రామంలో చాలా మందికి బిల్లులు రావడం లేదని కాని ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబ సభ్యులకు మాత్రం రూ. 1,30,000 వరకు బిల్లులు వచ్చినట్లు తనిఖీలు అధికారులు గుర్తించారు. దీనితో ఫీల్డ్ అసిస్టెంట్‌పై స్థానిక నాయకులు, అధికారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంకోల్ తండాలో 40 మందికి రూ. 24,690 మూడేళ్లుగా డబ్బులు ఇవ్వనట్లుగా గుర్తించారు. సంగంలో 26 మందికి ఏడాది పూర్తయినా డబ్బులివ్వట్లేదని అధికారులు తేల్చారు. బొప్పాస్ పల్లి మొక్కల 75శాతం మాత్రమే మొక్కలు బతికిఉన్నట్లు అసంతృప్తి వ్యక్తం చేశారు. అక్రమంగా చెల్లించిన డబ్బులను రికవరీ చేయాలని, చనిపోయిన మొక్కల స్థలాల్లో కొత్త మొక్కలు నాటాలని, డబ్బులు అందని వారికి డబ్బులు చెల్లించాలని ఏపీవోను అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పాల్య విఠల్, జిల్లా కో ఆప్షన్ మెంబర్ మాజీద్ ఖాన్, ఎంపీడీవో సుబ్రమణ్యం, ఏపీవో తక్మల్, సొజన్య నాయకులు పెర్క శ్రీనివాస్, ప్రతాప్ సింగ్ జీపీ కార్యదర్శులు ఉన్నారు.

గంజాయి విక్రయిస్తున్న మహిళల అరెస్ట్

- 4 కిలోల ఎండు గంజాయి స్వాధీనం
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి వెల్లడి


సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి

ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ఆటోనగర్ కాలనీలో నాలుగు కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి సోమవారం తెలిపారు. జిల్లా కేంద్రంలోని నిజామాబాద్ ఎస్‌హెచ్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. నగరంలోని ఆటోనగర్‌లో ఎండు గంజాయి అమ్ముతున్నారనే సమాచారం మేరకు ఆదివారం రాత్రి ఎక్సైజ్ అధికారుల బృందం దాడులు చేసింది. దాడుల్లో షేక్ రశీదా బేగం, షేక్ ఫరీదా బేగం వద్ద నుంచి రూ. లక్ష విలువైన నాలుగు కిలోల ఎండు గంజాయి స్వాధీనం చేసుకుని వారిద్దరిని అరెస్టు చేశారు. ఈ గంజాయిని మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి నిజామాబాద్‌కు తీసుకొచ్చి ప్యాకెట్ల రూపంలో విక్రయిస్తున్నారు. నాందేడ్‌లో రూ. 11వేలకు కిలో గంజాయి కొనుగోలు చేశారు. దీనిని చిన్నచిన్న ప్యాకెట్లు చేసి ఒక్కో ప్యాకెట్‌ను రూ. 300 చొప్పున అమ్ముతున్నారు. గతంలో ఇద్దరి మహిళలపై కేసులున్నాయి. షేక్ రశీదా బేగం వద్ద 2017లో 16 కిలోల గంజాయి పట్టుబడినట్లు సూపరింటెండెంట్ చెప్పారు. సమావేశంలో ఎక్సైజ్ ఎస్సై మల్లేశ్, హెడ్‌కానిస్టేబుల్ శ్రావణ్ పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

- చెరువుకు తీసుకెళ్లిన మామను చితకబాదిన స్థానికులు
- మనస్తాపంతో అదే చెరువులో దూకి ఆత్మహత్యాయత్నం చేసిన మామ


ఆనంద్ (ఫైల్)

కామారెడ్డి క్రైం : చెరువులో స్నానం చేయడానికి ఈతకు వెళ్లిన మైనర్ బాలుడు మృత్యువాత పడ్డాడు. బాలుడిని ఎందుకు తీసుకెళ్లావని బాలుడి మామను స్థానికులు చితకబాదగా మనస్తా పంతో చెంది అదే చెరువులో దూకి ఆత్మహత్యకు యత్నించగా మామను స్థానికులు కాపాడి ఆస్పత్రికి తరలించారు. కామారెడ్డి మండలం శాబ్దిపూర్‌తండా చెరువులో జరిగిన ఈ ఘటన జరిగింది. కామారెడ్డి పట్టణంలోని గుమాస్తా కాలనీకి చెందిన రమేశ్ అతని అల్లుడు ఆనంద్ (14)ను తీసుకుని శాబ్దిపూర్ తండాలో ఉన్న చెరువుకు ఈత కొట్టడానికి వెళ్లారు. ముందుగా ఆనంద్ స్నానం చేయడానికి చెరువులో దిగాడు. చెరువులో గుంతలు ఉండటంతో నీటిలో మునిగి ఆనంద్ మృతి చెందాడు. విషయం తెలుసుకుని చెరువు వద్దకు వెళ్లిన స్థానికులు చిన్న పిల్లవాడిని ఈతకు ఎందుకు తీసుకెళ్లావని రమేశ్‌ను చితకబాదారు. అయితే స్థానికులు చేసిన పనికి మనస్తాపం చెందిన రమేశ్ ఆత్మహత్య చేసుకునేందుకు అదే చెరువులో దూకాడు.

గమనించిన స్థానికులు రమేశ్‌కు కాపాడారు. ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు, ఫైర్ సిబ్బంది ఆనంద్ మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆత్మహత్యకు యత్నించిన రమేశ్‌కు జిల్లా ఆస్పత్రిలో చికిత్స చేస్తున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.